



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
05 మార్చి 2025
పేజీలు: 02




## గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు: జగన్

గవర్నర్ బడ్జెట్ ప్రసంగంలో మొత్తం అబద్ధాలు చెప్పించారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. బుధవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'రెండు బడ్జెట్‌లలోనూ నిధులు కేటాయించలేదు. ప్రజలను మోసం చేసిన తీరు స్పష్టంగా కనిపిస్తోంది. 9 నెలల్లో 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చేశామని గవర్నర్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఇప్పటికి ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయలేదు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతిని మరిచిపోయారు.' అని ఆరోపించారు.



## ట్రంప్ దెబ్బకు దిగొచ్చిన జెలెన్‌స్కీ

అమెరికా సైనిక సహాయాన్ని తాత్కాలికంగా తక్షణమే నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్దిగంటల్లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ దిగొచ్చారు. ఇటీవల జరిగిన చర్చల్లో ట్రంప్‌తో గొడవ జరగడం నిజంగా విచారకరమని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. విబేధాలు సరిచేసుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్)లో స్పందించారు. ఉక్రెయిన్-అమెరికా మధ్య భవిష్యత్తులో పరస్పర సహకారం, కమ్యూనికేషన్ నిర్మాణాత్మకంగా ఉండేలా జాగ్రత్తపడతానని జెలెన్‌స్కీ తెలిపారు. అమెరికా కోరుతున్న అరుదైన ఖనిజాలు అందించేందుకు సిద్ధమేనని ప్రకటించారు. దీనిపై ఒప్పందం కుదుర్చుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ట్రంప్ బలమైన నాయకత్వంతో ముందుకు వెళ్లి రష్యాతో యుద్ధానికి పలికేందుకు వీలైనంత వేగంగా పనిచేస్తామని ప్రకటించారు.

### నేడు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా
## రెండో సెమీస్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరిన భారత జట్టు ప్రత్యర్థి ఎవరో బుధవారం తేలనుంది. లాహోర్ వేదికగా జరుగబోయే రెండో సెమీస్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. ఐసీసీ టోర్నీలలో ఇప్పుడిప్పడే 'చోకర్స్' అన్న ముద్రను తొలిగించుకుం టున్న దక్షిణాఫ్రికా.. నిలకడగా ఆడే న్యూజిలాండ్‌తో కీలక పోరులో ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగా ల్లో ఇరు జట్లు సమంగా ఉండటంతో సెమీస్ పోరు రసవత్తరంగా సాగడం ఖాయం. అయితే వరుసగా గాయాలతో సతమతమవుతున్న సఫారీలకు తాజాగా మార్క్మ గాయం వేధిస్తోంది. కివీస్‌తో మ్యాచ్ లో అతడు ఆడతాడా? లేదా? అన్నది మ్యాచ్ సమయానికి తేలనుంది.





### తెలంగాణలో ప్రారంభమైన
## ఇంటర్ పరీక్షలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇవాళ్టి నుంచి ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వద్దకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. ప్రతి విద్యార్థిని హాల్‌టికెట్స్‌తోపాటు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు అనుమతిస్తున్నారు. 9 గంటలు సమయం దాటినా 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను సైతం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.



## సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం

టాలీవుడ్ పాపులర్ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ వార్తతో టాలీవుడ్ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. హైదరాబాద్‌లోని నిజాంపేటలోని తన ఇంట్లో నిద్ర మాత్రలు మింగి ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. నిజాంపేటలోని వర్టెక్స్ ప్రీ విలేజ్ గేటెడ్ కమ్యూనిటీ లో నివాసముంటున్న కల్పన ఇంటి నుంచి రెండు రోజులుగా బయటకు రాకపోవడంతో సెక్యూరిటీ అసోసియేషన్ సభ్యులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అసోసియేషన్ సభ్యులు ఆమె ఫోన్‌కు కాల్ చేయగా, ఎలాంటి రెస్పాన్స్ లభించలేదు. దీంతో వారు కల్పన భర్తకు ఈ విషయాన్ని ఫోన్ చేసి వివరించగా.. ఆయన కూడా ఆమెకు ఫోన్ చేసే ప్రయత్నం చేశాడట. కానీ, ఎలాంటి రెస్పాన్స్ రాలేదని తెలుస్తోంది. దీంతో అసోసియేషన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఆమె ఇంటి తలుపులు పగులకొట్టగా, కల్పన స్పృహ తప్పి ఉన్నట్లు గుర్తించారు. వారు వెంటనే ఆమెను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## సంతాన ప్రాప్తిరస్తు టీజర్ రిలీజ్

తెలుగమ్మాయి చాందిని చౌదరి, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మూవీ సంతాన ప్రాప్తిరస్తు. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. వెన్నెల కిషోర్, అభినవ్ గోమతం, జీవన్‌కుమార్, తరుణ్ భాస్కర్, తాగుబోతు రమేష్ లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.తాజాగా ఈచిత్ర టీజర్‌ను విడుదల చేశారు. పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తోంది. వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉన్న ఓ యువకుడు తన భార్యను గర్భవతిని చేయడానికి కష్టపడుతున్న కథలా అనిపిస్తోంది.100 రోజుల్లో గర్భవతిని చేయాలనే కండిషన్ పెట్టగా.. ఆ టైమ్‌లోగా అతడి భార్య గర్భవతి అయిందా లేదా అనే కథాంశంతో తెరకెక్కినట్లుగా కనిపిస్తోంది.సునీల్ కశ్యప్ సంగీతాన్ని అందిస్తున్నారు. మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి లు నిర్మిస్తున్నారు.



### కుంభమేళాలో ఓ కుటుంబానికి
## 30 కోట్ల ఆదాయం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ముగిసింది. అయితే దీని నిర్వహణపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గట్టిగా బదులిచ్చారు. కుంభమేళా వల్ల ఎంతోమంది ఆర్థికంగా లాభపడ్డారని తెలిపారు. ఓ కుటుంబం 130 పడవలు నడిపిస్తూ ఏకంగా దాదాపు రూ.30 కోట్లు ఆర్జించిందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రయాగ్‌రాజ్‌లో పడవలు నడిపేవారు దోపిడీకి గురయ్యారని సమాజ్‌వాదీ పార్టీ చేసిన ఆరోపణలపై సీఎం సభలో స్పందించారు. "పడవ నడిపే ఓ వ్యక్తి విజయగాథను నేను పంచుకోవాలని అనుకుంటున్నా. అతడి కుటుంబానికి 130 పడవలు ఉన్నాయి. కుంభమేళా సమయంలో ఒక్కో పడవతో రోజుకు రూ.50వేల నుంచి రూ.52వేల వరకు సంపాదించారు. అంటే 45 రోజులకు ఒక్కో పడవతో దాదాపు రూ.23లక్షల చొప్పన ఆదాయం సమకూరింది. అలా మొత్తంగా 130 పడవలతో రూ.30కోట్లు ఆర్జించారు" అని యోగి వివరించారు.


నా వల్లే లాలూ ఎదిగారు.. నువ్వు పిల్లాడివంటూ తేజస్వీపై నీతీశ్ మండిపాటు

ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారని సీఎం తెలిపారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా కుంభమేళా నిర్వహించామని పేర్కొన్నారు. 45 రోజుల్లో ఒక్క నేరం కూడా చోటు చేసుకోలేదని వ్యాఖ్యానించారు. కుంభమేళా నిర్వహణ కోసం రూ.7500 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. దాదాపు రూ.3లక్షల కోట్ల వ్యాపారం జరిగిందని వెల్లడించారు. హోటల్ పరిశ్రమకు రూ.40వేల కోట్లు, ఆహారం, ఇతర నిత్యావసరాల రంగానికి రూ.33వేల కోట్లు, రవాణాకు రూ.1.5లక్షల కోట్ల మేర ఆదాయం లభించిందన్నారు. ఆర్థికంగా చూస్తే కుంభమేళా నిర్వహణ ఈ ఏడాది దేశ జీడీపీ 6.5శాతం వృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరిగిన సంగతి తెలిసిందే.



## చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ

భారత క్రికెట్ జట్టు కెప్టెన్గా రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. క్రికెట్ చరిత్రలో నాలుగు ఐసీసీ టోర్నమెంట్లలోనూ జట్టును ఫైనల్స్కు చేర్చిన తొలి కెప్టెన్గా హిట్మ్యాన్ రికార్డుకెక్కాడు. 2023 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్, 2023 వన్డే వరల్డ్కప్, 2024 టీ20 ప్రపంచకప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ను ఫైనల్కు చేర్చాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్, వన్డే వరల్డ్కప్ ఫైనల్స్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోగా_ _ _ టీ20 వరల్డ్కప్లో మాత్రం దక్షిణాఫ్రికాపై టీమిండియా గెలిచింది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోనూ విజయం సాధించాలని కోట్లాది మంది అభిమానులు కోరుకుంటున్నారు. ఇక భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 2007, 2011, 2013లో వరుసగా మూడు ఐసీసీ ఈవెంట్లలో టీ20 ప్రపంచ కప్, వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలలో భారత్కు టైటిల్స్ అందించాడు.




## మలక్ పేట్ శిరీష హత్య కేసులో ట్విస్ట్

మలక్ పేట్ శిరీష హత్య కేసు ప్రస్తుతం వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే తాజా ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. శిరీష గుండెపోటుతో మరణించలేదని, ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లుగా పోస్ట్‌మార్టం నివేదికలో బయటపడిందని మృతురాలి బంధువులు చెబుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెలితే.. కర్నూలు జిల్లాలోని ఈగలపెంట కు చెందిన వినయ్ తో సింగం శిరీషకు 2017 లో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆరేళ్ల పాప ఉంది. వినయ్, శిరీష హైదరాబాద్ లో మలక్పేట్ జమున టవర్స్ లో నివాసం ఉంటున్నారు. కాగా, శిరీష సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. శిరీష చనిపోయిన విషయాన్ని చెప్పి చెప్పనట్లుగా ఆమె సోదరికి ఫోన్ చేసి చెప్పాడు వినయ్. ఆమె గుండెపోటుతో మరనించిందని వినయ్ తెలిసినప్పటికి, శిరీష బాడీ మొత్తం దెబ్బలు కనిపించడంతో.. వెంటనే మలక్పేట్ పోలీసులను ఆశ్రయించారు శిరీష కుటుంబ సభ్యులు. కేసు నమోదు చేసిన పోలీసులు, శిరీష మృతదేహానికి ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే తాజాగా ఈ హత్య కేసులో మరో ట్విస్ట్ బయట పడింది. తన అక్క మాట వినకుండా ఎదురు తిరుగుతుందని కోపంతో వినయ్ శిరిషను హత్య చేసినట్లు సమాచారం.

## పెళ్లికి నిరాకరించిన అమ్మాయిని హత్య చేసి.. సూసైడ్ చేసుకున్నాడు

కర్నాటకలో దారుణం జరిగింది. ఓ అమ్మాయి తనతో పెళ్లికి అంగీకరించలేదని, ఆ ఉన్మాది ఆమెను చంపేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బెల్గావిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నాథ్ పాయి సర్కిల్ వద్ద 20 ఏళ్ల ఐశ్వర్య మహేష్ లోహర్ అనే అమ్మాయిని.. 29 ఏళ్ల ప్రశాంత్ కుందేకర్ హత్య చేశాడు. బెల్గావి తాలుకలోని యెల్లూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఐశ్వర్యను ఏడాది కాలం నుంచి ప్రశాంత్ ప్రేమిస్తున్నాడు. పెయింటర్‌గా పనిచేస్తున్న ఆ వ్యక్తి.. గతంలో ఓ సారి ఐశ్వర్య తల్లిని పెళ్లి గురించి ప్రస్తావించాడు. ఐశ్వర్యను పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పాడు. కానీ ఆర్థికంగా స్థిరపడాలని బాధితురాలి తల్లి నిందితుడికి హితబోధ చేసింది. ఐశ్వర్య పిన్ని ఇంటికి విషం బాటిల్‌తో వెళ్లిన ప్రశాంత్.. పెళ్లి చేసుకోవాలని ఆమెను వత్తిడి చేశారు. ప్రశాంత్ అభ్యర్థనను ఆమె తిరస్కరించింది. విషం తాగేలా ఐశ్వర్యను వత్తిడి చేశాడు. కానీ ఆమె అడ్డుకున్నది. ఆ సమయంలో తన జేబులో ఉన్న కత్తిని తీసి.. ఐశ్వర్య గొంతు కోశాడు ప్రశాంత్. విపరీతంగా రక్త స్త్రావం కావడంతో ఐశ్వర్య మృతిచెందినట్లు తేల్చారు. ఆ తర్వాత అదే కత్తితో.. తన గొంతు కోసుకున్న ప్రశాంత్.. అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.



ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు సీనియర్ పోలీసు అధికారి, సిటీ పోలీసు కమీషనర్ యాద మార్టిన్ తెలిపారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# రాంగోపాల్ వర్మకు మరోసారి సీఐడీ అధికారుల నోటీసులు

ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మకు మరోసారి షాక్ తగిలింది. 2019లో 'కమ్మ రాజ్యంలో.. కడప రెడ్లు' సినిమాపై ఒంగోలు, అనకాపల్లి, మంగళగిరిలో నమోదైన కేసులు నమోదైన విషయం తెలిసిందే. అయితే, ఆ కేసులలో విచారణకు హాజరు కావాలని ఇవాళ మరోసారి గుంటూరు సీఐడీ అధికారులు రాంగోపాల్ వర్మకు నోటీసులు జరీ చేశారు. కానీ, ఇప్పటికే సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ.. ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం కేసు ట్రయల్ కొనసాగుతుండగానే ఆయనకు సీఐడీ నుంచి మరోసారి నోటీసులు అందాయి. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే గుంటూరు సీఐడీ అధికారులు రాంగోపాల్ వర్మకు ఫిబ్రవరి 10న నోటీసులు జారీ చేశారు. కానీ, విచారణకు ఆయన గైర్హాజరై.. తన న్యాయవాదిని సీఐడీ కార్యాలయానికి పంపారు. సినిమా ప్రమోషన్ ఉన్న నేపథ్యంలో విచారణకు రాలేనని.. తనకు మరో 8 వారాల గడువు ఇవ్వాలని అభ్యర్థించారు. కానీ, ఇవాళ ఆర్జీవీకి సీఐడీ అధికారులు నోటీసులు ఇవ్వడం ఆసక్తిగా మారింది.

# మళ్లీ పెరిగిన బంగారం

పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి. బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్, బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.






### అంతర్జాతీయ వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించిన

# ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్.. వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ క్షణం నుంచి వన్డే క్రికెట్ నుంచి విరమణ తీసుకుంటున్నట్లు చెప్పాడు. తాజాగా జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీలో.. ఆస్ట్రేలియా జట్టు సారథిగా బాధ్యతలు నిర్వర్తించాడు. అయితే మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. దీంతో 35 ఏళ్ల స్మిత్.. వన్డేల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పాడు. స్టీవ్ స్మిత్ తన కెరీర్‌లో 170 వన్డేలు ఆడాడు. వాటిల్లో 5800 రన్స్ చేశాడు. దీంట్లో 12 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ప్యాట్ కమ్మిన్స్ గైర్హాజరీలో చాంపియన్స్ ట్రోఫీ కోసం స్టీవ్ స్మిత్ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టాడు. తన వన్డే జర్నీ అద్భుతంగా సాగిందని, ప్రతి క్షణాన్ని ప్రేమించినట్లు స్మిత్ తెలిపాడు. తన క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత క్షణాలు ఉన్నాయని, మధుర స్మృతులు, జ్ఞాపకాలు ఉన్నాయని, రెండు ప్రపంచ కప్‌లు గెలవడం సంతోషంగా ఉందని, తనతో ఎంతో మంది జట్టు సభ్యుల్ని కెరీర్‌ను పంచుకున్నట్లు స్మిత్ తన ప్రకటనలో తెలిపాడు. 2027 వరల్డ్‌కప్ కోసం ఆస్ట్రేలియా జట్టు సమాయత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని స్మిత్ పేర్కొన్నాడు. టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నానని, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆడేందుకు ఆసక్తిగా ఉన్నానని, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ పాల్గొనున్నట్లు చెప్పాడు. ఆస్ట్రేలియా తరపున వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన క్రికెటర్లలో స్టీవ్ స్మిత్ 12వ బ్యాటర్‌గా నిలిచాడు. 2015 నుంచి 2025 వరకు ఆస్ట్రేలియాకు 64 మ్యాచుల్లో సారథిగా చేశాడు.

# లైఫ్‌లో మళ్ళీ అలాంటి పని చేయను

స్టార్ హీరోయిన్స్ ఒకరైన సమంత గురించి ఎంత చెప్పకున్నా తక్కువే అవుతుంది. కెరీర్ మంచి పీక్స్ లో ఉండగానే తన జీవితం అనుకోని మలుపు తిరిగింది. భర్తతో విడిపోయి ఒంటరిగా గడుపుతున్న క్రమంలో, మయోసైటిసిస్ అనే వ్యాధి బారిన పడింది సమంత. ఈ నేపథ్యంలో కొంతకాలం పాటు సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉండి ఆరోగ్యం కోసం ఎంతగానో పోరాడింది. ఇక ఇప్పుడిప్పుడే తిరిగి సాధారణ స్థితికి రావడం తో సినిమాలపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టింది సమంత. కానీ సినిమాల కంటే ఎక్కువగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రోజు వార్తల్లో నిలుస్తోంది. తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని షేర్ చేసుకుంటుంది. అయితే ఇటీవల సమంత ప్రేమలో పడ్డారు అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తాజాగా దీనిపై స్పందించింది సామ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో భాగంగా సమంత మాట్లాడుతూ 'జీవితంలో మళ్లీ ప్రేమలో పడాలని ఎప్పుడూ కూడా ఆలోచించలేదు. వాటిపై ఇంకా చర్చించాలని కూడా లేదు. అది నా పూర్తి వ్యక్తిగతమైన విషయం. దాన్ని అలాగే వ్యక్తిగతంగానే ఉంచుతాను' అంటూ చెప్పకొచ్చింది. అంటే సమంత మాటలను బట్టి చూస్తే వచ్చిన రూమర్స్ లో ఎలాంటి నిజం లేదు అని, సమంతకి మలి ప్రేమలో పడే ఉద్దేశం కూడా లేదని అర్థమవుతుంది. కానీ సమంత మాటకు, ఆమె అభిమానులు ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. 'ఇలా ఒంటరిగా ఉండటం వల్ల లాభం లేదు మీకూడా ఒక లైఫ్ ఉంది' అంటూ కామెంట్లు పెడుతున్నారు.





# వచ్చేనెల పెళ్ళి.. ఇంతలోనే ప్రాణాలు కోల్పోయిన వరుడు

సరదాగా ఆట పాటించడంలో అనుకోని ప్రమాదాలు జరుగుతాయి. ఆ సరదా లో ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. ఇలాంటి వార్తలు మనం చాలా చూశాం. తాజాగా కాచిగూడ లో ఇలాంటి సంఘటన ఒకటి చోటుచేసుకుంది. కాబోయే భార్య ను భయపెడదామని గొంతుకు వైరు బిగించుకున్ని వీడియో కాల్ చేసిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పూర్తి వివరాల్లోకి వెలితే.. కాచిగూగ తిలక్‌నగర్ లో ఆదర్శ అనే యువకుడు ఫ్యామిలతో నివాసం ఉంటున్నాడు. క్యాబ్ డ్రైవర్ గా పని చేస్తున్న ఆదర్శకు రీసెంట్ గానే పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో సరదాగా ఫోన్ మాట్లాడుతూ. ఫ్యాన్ కి ఐరన్ బాక్స్ వైర్ తో తన గొంతుకు బిగించుకుని, ఈ దృశ్యాన్ని తన కాబోయే భార్యకు వీడియో ద్వారా చూపించాడు ఆదర్శ్. అంతలోనే సరదాగా నేను ఆటపటించడాని ఇలా చేశాను అంటూ స్టూల్ మీద నుండి కిందకి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా గొంతుకు వైర్ బిగుసుకుపోయి గిలగిల కొట్టుకున్నాడు, ఆ సమయంలో కాపాడానికి కూడా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు ఆదర్శ్. వచ్చేనెల పెళ్ళి, అని ఏర్పట్లు పూర్తిచేసుకున్న క్రమంలో ఇలాంటి దారుణం జరగడంతో.. రెండు కుటుంబల్లో విషాద ఛాయాలు అలుముకున్నాయి. ఇక ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 'నేను ఎంత చెప్పిన వినలేదు'- కేఎల్ రాహుల్!



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సెమీఫైనల్ లో విజయం సాధించి భారత్ ఫైనల్ కు దూసుకెళ్లడానికి శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, విరాట్ కోహ్లీ కీలకంగా వ్యవహరించారు. అయితే ఈ పోరులో కోహ్లీ - కేఎల్ రాహుల్ కలిసి కాసేపు స్కోర్ బోర్డును ముందుకు తీసుకెళ్లారు. అయితే ఓ సందర్భంలో కోహ్లీపై కేఎల్ రాహుల్ కాస్త కోపడ్డాడు. ఎందుకు అలా చేశావంటూ మండిపడ్డాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పాకిస్థాన్ పై సెంచరీ బాదిన కోహ్లీ.. ఆసీస్ సెమీఫైనల్ మ్యాచ్ లోనూ శతకం బాదుతాడని అంతా ఆశించారు. అందుకు తగ్గట్టే అతడు మంచి ప్రదర్శనే చేశాడు. అయితే భారత్ విజయానికి 40 పరుగుల దూరంలో ఉన్న సమయంలో కాస్త దూకుడు ప్రదర్శించి తృటిలో సెంచరీని మిస్ చేసుకున్నాడు కోహ్లీ. జంపా బౌలింగ్‌లో అనవసర షాట్ ఆడి 43వ ఓవర్లో పెవిలియన్ చేరాడు. అప్పుడు వెంటనే కోహ్లీతో పాటు మరో ఎండ్ లో ఉన్న కేఎల్ రాహుల్ కాస్త అసహనానికి గురయ్యాడు. 'నీకు ముందే చెప్పా కదా చివరి వరకు నువ్వు క్రీజులో ఉండాల'ని అంటూ కాస్త కోహ్లీపై కోపడ్డాడు. తాను ఎంత చెప్పినా వినకుండా విరాట్ అనవసర షాట్ బాది ఔటైనట్లు ఆ తర్వాత వివరించాడు. దీనిపై మ్యాచ్ అనంతరం కేఎల్ రాహుల్ మాట్లాడుతూ.. "క్రీజులోకి రాగానే కోహ్లీతో కాసేపు మాట్లాడాను. ఆఖరి వరకు క్రీజులోనే ఉండాలని చెప్పాను. నువ్వు ఓవైపు ఎండ్‌లో ఉంటే.. నేను మరోవైపు ఎండ్‌లో రిస్క్ తీసుకొని షాట్లు ఆడతాను అని చెప్పాను. అతడు సెట్ బ్యాటర్. కాబట్టి క్రీజులో ఉండటం జట్టుకు ఎంతో అవసరం. అతడితోనూ ఇదే చెప్పాను. రిస్క్ నేను తీసుకుని షాట్లు ఆడతానని చెప్పాను. కానీ అతడే తొందరపడి జంపా బౌలింగ్ లో బంతిని బలంగా బాది ఔట్ అయ్యాడు." అని రాహుల్ వివరణ ఇచ్చాడు. విరాట్ కోహ్లీ ఔట్ అవ్వగానే గౌతమ్ గంభీర్ కూడా కాస్త నిరాశకు గురైనట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో భారీగా గంజాయి పట్టివేత

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి పెద్ద మొత్తంలో నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆలస్యంగా వెలుగుచూసింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న రైల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి వద్ద తనిఖీలు చేపట్టారు. అతని బ్యాగ్ పరిశీలించగా అందులో 26.885కేజీల గంజాయిని గుర్తించారు. అనంతరం బ్యాగ్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పాయల్ హాట్ లుక్స్

ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ అయిన భామ పాయల్ రాజ్ పుత్. ఆర్ ఎక్స్ 100 సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది పాయల్ రాజ్ పుత్ . తొలి సినిమాతోనే హిట్ అందుకుంది ఈ అమ్మడు. అంతే కాదు ఆర్ఎక్స్ 100 సినిమాలో తన అందాలతో కవ్వించింది పాయల్. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. ఇక ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోయింది. ఎన్టీఆర్: కథానాయకుడు సినిమాలోనూ నటించింది. RDX లవ్, వెంకీ మామా, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, జిన్నా ఇలా వరుసగా సినిమాలు చేసింది. కానీ ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. సినిమాలతో పాటు వెబ్ సిరీస్ ల్లోనూ నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. చివరిగా మంగళవారం సినిమాతో హిట్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ. కానీ స్టార్ హీరోయిన్ హోదాను అందుకోలేకపోయింది. అంతే కాదు ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ అవకాశాలు కూడా అందుకోలేకపోతోంది.

